## క్లుప్తంగా

### చట్టాలపై అవగాహన అవసరం



వృద్ధుడికి అవగాహన కల్పిస్తున్న న్యాయవాది వసంత

**కాకినాడ లీగల్:** వృద్ధాప్యంలో ఉన్న వారికి హక్కులపై సంపూర్ణ అవగాహన ఉంటే జీవితం ఆనందమయంగా ఉంటుందని ప్యానల్ న్యాయవాదులు వై.వసంత, శ్రీపాద రాజశేఖర్ అన్నారు. కాకినాడ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం వెలమల తూరంగి గ్రామం జనావళి వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు వసంత, రాజశేఖర్ మాట్లాడుతూ, సీనియర్ సిటిజన్లకు ప్రభుతం, న్యాయ వ్యవస్థ కల్పించిన హక్కులను వివరించారు. అనేక చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ అధ్యక్షుడు మందపల్లి శ్యామ్, వృద్ధులు పాల్గొన్నారు.

### 6 నుంచి రేచర్లపేట రైల్వే గేట్ మూసివేత

**బాలాజీచెరువు:** కాకినాడ టౌన్, పోర్టుస్టేషన్ల మధ్య ఉన్న రేచర్లపేట లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్‌ను ఈ నెల ఆరు నుంచి 12వ తేదీ వరకూ ట్రాక్ మరమ్మతుల కోసం మూసివేసున్నట్లు కాకినాడ రైల్వేసెక్షన్ ఇంజినీర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఏడు గంటల వరకూ ట్రాక్ మరమ్మతులు జరుగుతాయని పేర్కొంది. నగరవాసులు ఈ విషయాన్ని గమనించాలని సూచించింది.

### నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వేళంగిలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్, ఎస్సై

**కరప:** బాణసంచా తయారీదారులు నిబంధనలు అతిక్రమించి మందుగుండు సామగ్రి తయారు చేసినా, నిల్వ చేసినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్ హెచ్చరించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కరప ఎస్సై టి.సునీత, ఆర్ఐ పవన్‌తో కల్సి ఆయన మండలంలోని వేళంగి, గొర్రిపూడి, నడకుదురు గ్రామాల్లోని బాణసంచా తయారీకేంద్రాలను బుధవారం తనఖీ చేశారు. బాణసంచా తయారీదారులు భద్రతా నియమాలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అనుమతి లేకుండా బాణసంచా తయారు చేయడం, నిల్వ ఉంచడం చేయరాదన్నారు. తయారీ కేంద్రం వద్ద ఇసుక, నీరు, అగ్నిమాపక యంత్రపరికరం అందుబాటులో ఉంచాలన్నారు. మహిళలు, చిన్నారులతో బాణసంచా తయారు చేయించరాదన్నారు. ఫస్ట్ ఎయిడ్ బ్యాక్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. అంబులన్స్ రాకపోకలు అనుకూలంగా రోడ్డు మార్గం ఉండాలన్నారు. గ్లౌజులు, సేఫ్టీ గాగుల్స్, మాస్కులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాలలో నిబంధనలు, అనుసరించాల్సిన విధివిధానాలపై సూచనలిచ్చారు.

### ఆన్‌లైన్‌లో ఇంటి పన్నుల చెల్లింపులు



నడకుదురులో అవగాహన కల్పిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు

**కరప:** ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్లలో స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుంటే, పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఇంటిపన్ను చెల్లించవచ్చని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వి.వారిజ పాల్గొన్నారు.

### నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యం



సత్యకాలనీ సెంటర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కిర్లంపూడి:** పల్లెల్లో నిరక్షరాస్యత నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా గణాంక సహాయకులు పోలిశెట్టి రాజేష్ తెలిపారు. జగపతినగరంలోని సత్యకాలనీలో అక్షరాంధ్ర సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రస్తుత సమాజంలో విద్య ప్రాముఖ్యాన్ని వివరించారు. నూతన విద్యా విధానంపై అక్షరాంధ్ర వలంటీర్‌కు పలు సూచనలు అందజేశారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీడీఓ సత్యప్రసాద్, ఎంఈఓ టి.జోసఫ్, ఏపీఎం వేదకుమారి తదితరులు ఉన్నారు.

# అంత ఈజీ కాదు

- సులువుగా డబ్బు సంపాదనపై అత్యాశ
- ఇదే అదనుగా సైబర్ నేరగాళ్ల మోసాలు
- నగరవాసులే టార్గెట్
- ఆన్‌లైన్‌లో గుల్లవుతున్న అమాయకులు
- సామాజిక మాధ్యమాలే వేదిక..!



**కాకినాడ క్రైం:**

● కాకినాడ మెయిన్ రోడ్‌లో ఓ డీటీపీ సెంటర్ యజమాని ఆన్‌లైన్ యాప్‌కు అనుసంధానమయ్యారు. రూ.3 వేలతో మొదలెట్టి తక్కువ కాలంలోనే లాభాలు గడించారు. తన పెట్టుబడిని రూ.2 లక్షలకు పెంచారు. అంతే యాప్ క్లోజ్ అయిపోయింది. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి బాధితుడిది.

● గాంధీనగర్ రైతు బజారు సమీపంలో నివసించే ఓ గృహిణి ఇన్‌స్టాగాంలో ఓ యాడ్ చూసి ఆన్‌లైన్ వర్క్ కోసమని రూ.5 వేలు చెల్లించింది. నెల రోజుల వ్యవధిలో రూ.27 వేలు సంపాదించింది. ఈసారి రూ.70 వేలు పెట్టుబడి పెట్టింది. అవతలి నుంచి స్పందన లేదు. తాను మోసపోయానని తెలుసుకోడానికి ఎంతో సమయం పట్టలేదు.

అత్యాసకు పోయి మోసపోతున్న బాధితులు నానాటికీ అధికమవుతున్నారు. ముఖ్యంగా నగరాల్లో యువత, నడి వయస్కులు ఈ మోసాలకు గురై జేబులు గుల్ల చేసుకుంటున్నారు. నేరగాళ్ల అంతర్జాలాన్నే అస్త్రంగా వాడుకుంటున్నారు. పట్టుకుందామని యత్నిస్తే.. ఇంటర్నెట్ మహా సముద్రంలో అంతే త్వరగా మాయమవుతున్నారు. రూపాయికి పది రూపాయిలు ఇస్తామని నమ్మించి నట్టేట ముంచుతున్నారు. ఈజీ మనీ ఎరవేసేందుకు ప్రధాన మాధ్యమాలు యాడ్‌లే. వీటిని విస్తృతం చేసేది సోషల్ మీడియానే. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే వారే ఈ ఎరలో పడుతున్నారు. యాడ్‌లు నమ్మే సమయంలో విచక్షణ తప్పనిసరి అని పోలీసులు చెబుతున్నారు.

**మోసాలు ఇలా..**

ఆన్‌లైన్ పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లు, పార్ట్ టైం, వర్క్ ఫ్రం హోం జాబ్‌లు, అనుమానాస్పద వెబ్ లింక్‌లు, యాడ్‌లు, మల్టీ లెవల్ మార్కెటింగ్(ఎంఎల్ఎం) స్కీమ్‌ల్లో రిఫరల్ విధానాలు, యూట్యూబ్ లేదా ఇన్‌స్టాగాం ద్వారా ప్రమోట్ చేసి.. ఫలానా యాప్ డౌన్‌లోడ్ చేయండంటూ సిఫార్సులు, లాటరీ వచ్చిందని, గిఫ్ట్‌లు పంపుతామని.. డబ్బు కట్టాలని, ప్రభుత్వ పథకాల పేరుతో నకిలీ ప్రచారాలు, బ్యాంకుల పేరుతో చేసే వివిధ రకాల మోసాలు జరుగుతున్నాయి. వీటిపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**పండగ వేళల్లో..**

ఉగాది నుంచి మొదలు ఎన్నో పండగలు వస్తుంటాయి. ఇదే అదనగా ఆన్‌లైన్ వ్యాపారాలూ ఊపందుకుంటాయి. ఆఫర్లు, మెగా డిస్కౌంట్లు, బిగ్ డీల్స్ పేరుతో జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి. వినియోగదారులను ఆకర్షించేందుకు వాణిజ్య సంస్థలు ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. దీనిని మోసగాళ్లు ఆసరాగా తీసుకుని నేరాలకు పాల్పడుతున్నారు. అందుకే నమ్మదగిన సంస్థ నుంచే ఆన్‌లైన్ కొనుగోళ్లు చేయాలని, క్యాష్ ఆన్ డెలివరీకే ప్రాధాన్యమివ్వాలని నిపుణులు చెబుతున్నారు.

**వెతికి పట్టే వ్యవస్థ లేదు**

ఈజీ మనీ ఎర వేస్తున్న వాటిలో అధికమైనవి ఆన్‌లైన్ మోసాలే. వీటిలో చిక్కుకోకుండా ఉండడమే భద్రమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే ఈ కేసుల్లో నేరస్తుల్ని వెతికిపట్టుకునే సమర్థత పూర్తి స్థాయిలో జిల్లా పరిధిలో అభివృద్ధి చెందలేదు. ముఖ్యమైన సైబర్ సమస్యల పరిష్కారానికి కూడా పోలీసులు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

### రక్షణ పొందాలంటే..

● సులభంగా డబ్బు వస్తుందన్న మాట నమ్మవద్దు.
● ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దు.
● నిరుద్యోగులకు కాల్స్ చేసి జాబ్ రిజిస్ట్రేషన్లు లేదా ఫీజులంటూ చేసే మోసాలను నమ్మవద్దు. నిజమైన కంపెనీలు డబ్బులు వసూలు చేయవు.
● వాట్సాప్, ఎస్ఎంఎస్, సోషల్ మీడియాల్లో వచ్చే అనుమానాస్పద లింక్‌లు క్లిక్ చేయొద్దు.
● ప్రతి స్కీంను గూగుల్, యూట్యూబ్‌ల్లో వెరిఫై చేయాలి. అధిక డబ్బు సంపాదించవచ్చనే స్కీంల కోసం పాకులాడవద్దు.
● అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయరాదు.
● ఆన్‌లైన్ స్క్రాచ్ కార్డులు, ఆఫర్లు, బిగ్‌డీల్, బిగ్ సేల్‌తో పాటు, క్యాష్ బ్యాక్ ఆఫర్లు నమ్మకమైన సంస్థల ద్వారానే పొందాలి.
● ఆన్‌లైన్ వెబ్‌సైట్లలో డబ్బు చెల్లింపులకు అప్రమత్తత అవసరం.
● యూపీఐ యాప్‌ల కీలక వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు.

### ఈజీ మనీ ఓ మాయ



సునాయాసంగా డబ్బు సంపాదించడం ఓ మాయ. మోసకారులకు ఇదే అదను. ఈజీ మనీ కోసం అత్యాశకు పోవద్దు. అనవసర లింక్‌లు క్లిక్ చేయడం, యాప్‌లు ఇన్‌స్టాల్ చేయడం, పెట్టుబడులు పెట్టడం, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవడం ప్రమాదకరం. తరచుగా అందుతున్న ఫిర్యాదులు ఈ తరహా మోసాలే. కాకినాడ పోలీస్ శాఖ పరిధిలో ఈజీ మనీ నేరాల పరిష్కారానికి ఐటీ కోర్ సహా అనుబంధ విభాగాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. సైబర్ నేరం ద్వారా మోసపోతే 1930కి, సాధారణ మోసమైతే 112 లేదా డయల్ 100కి ఫిర్యాదు చేయాలి.

– దేవరాజ్ మనీష్‌పాటిల్, ఎస్‌డీపీవో(ఏఎస్పీ), కాకినాడ

**గడచిన నాలుగేళ్లలో కాకినాడ నగరంలో ఈజీ మనీ బాధితుల వివరాలు**

| | |
|---|---|
| 2021 | 95 మంది |
| 2022 | 152 మంది |
| 2023 | 149 మంది |
| 2024 | 166 మంది |
| 2025(సెప్టెంబర్ వరకు) | 155 మంది |

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న ఉండవల్లి సత్యలక్ష్మీ ఐశ్వర్య

**బోట్‌క్లబ్:** దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఉండవల్లి సత్య లక్ష్మీ ఐశ్వర్య కూచిపూడి నృత్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సుమారు అరగంట పాటు ఆమె చేసిన నృత్యం ఆహూతులను అలరించింది.

### బస్సు- ఆటో ఢీ

**ప్రత్తిపాడు రూరల్:** మండలంలోని ఒమ్మంగి–శరభవరం గ్రామాల మధ్య బుధవారం ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్నాయి. పోలీసుల వివరాల ప్రకారం, ప్రత్తిపాడు నుంచి శాంతి ఆశ్రమం వెళుతున్న ఆర్టీసీ బస్సు శరభవరం నుంచి ఒమ్మంగి వైపు వస్తున్న ఆటోని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు, ఆటోను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్నికల్లో లబ్ధికే అసత్యాల ప్రచారం

**వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగమణి**



**కాకినాడ రూరల్:** ఎన్నికల్లో లబ్ధి కోసమే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అసత్యాలు ప్రచారం చేశారని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గత ఎన్నికల్లో రాష్ట్రంలో 30 వేల మందికి పైగా యువతులు అదృశ్యమయ్యారంటూ పవన్ కల్యాణ్ ఎన్నికల్లో అసత్యాలను అస్త్రంగా ఉపయోగించుకున్నారని మండిపడ్డారు. తాజాగా ఎన్‌సీఆర్‌బీ విడుదల చేసిన 2023 వార్షిక నివేదిక పరిశీలిస్తే ఆనాడు పవన్ కల్యాణ్ చేసినవన్నీ నిరాధార ఆరోపణలేనని కొట్టిపడేశారు. ఎన్నికల్లో గెలిచేందుకు ఇంత దిగుజారుడు రాజకీయాలు అవసరమా అని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో పరిశీలిస్తే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనతో నేరాలు తగ్గాయని గుర్తు చేశారు. అదృశ్యమైన యువతల వ్యవహారంలో 86 శాతం మందిని గుర్తించి, వారి తల్లిదండ్రులకు అప్పగించిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా పవన్ కల్యాణ్ వాస్తవాలు గుర్తించాలని హితవు పలికారు. లిక్కర్ కేసులో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి, కక్ష రాజకీయాలకు చంద్రబాబు సర్కార్ తెరలేపిందన్నారు. నిజాన్ని దాచిపెట్టడం ఎవరి వల్లా కాదని మిథున్‌రెడ్డికి మంజూరైన బెయిల్ ద్వారా రుజువైందన్నారు. ఇప్పటికైనా కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలన్నారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు.. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచే ప్రక్రియను ఆపాలన్నారు.

## ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

**శంఖవరం:** పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ అన్నారు. స్థానిక గ్రామంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యుడు రాజీవ్ మాట్లాడుతూ మహిళల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, మందులు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## వేట్లపాలెంలో నేడు బేతాళ సంబరం

**సామర్లకోట:** మండలంలోని వేట్లపాలెం గ్రామంలో నిర్వహించే బేతాళ సంబరానికి ఓ ప్రత్యేకత ఉంటుంది. శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని గ్రామ శివారులో ఉన్న బేతాళ స్వామిని భారీ ఊరేగింపుగా తీసుకొచ్చి గ్రామంలోని ఆలయంలో ఉంచారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజా కార్యక్రమాలు, పారాయణ నిర్వహించారు. శరన్నవరాత్ర ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని భారీఎత్తున బేతాళ సంబరం వైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ నాయకులు కొండపల్లి జగ్గారావు, సూరన్నచౌదరి, కాకర్ల గంగాధర్, గద్దె సాయిరాం తెలిపారు. సంబరాన్ని తిలకించడానికి గ్రామానికి చెందిన వారు ఏ రాష్ట్రంలో, ఏ దేశంలో ఉన్నా తప్పనిసరిగా హాజరుకావడం ఆనవాయితీగా వస్తోంది. సంబరాన్ని పురస్కరించుకుని గ్రామంలో నైవేద్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిండి వంటలు తయారు చేసి కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేస్తారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గ్రామమంతా బేతాళస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తారు. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు. ముగింపు సందర్భంగా బేతాళ స్వామిని గ్రామ శివారుకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చి వేస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాత్రి భారీ బాణసంచా కాల్పులు ఉంటాయి.

## వయోజనుల హక్కులను గుర్తించాలి

- ఆర్డీఓ శ్రీరమణి



ఉత్తమ అత్తాకోడళ్లను సత్కరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి తదితరులు

**పెద్దాపురం(సామర్లకోట):** ప్రతి ఒక్కరూ వయోజనుల హక్కులను గుర్తించి, వారిని గౌరవించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. ప్రపంచ వయోజనుల దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్దల నుంచి అనేక సూచనలు, సలహాలను తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. వృద్ధులకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. వృద్ధుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే చట్ట ప్రకారం శిక్షకు గురవుతారని హెచ్చరించారు. అనాథలుగా ఉన్న వృద్ధులను గుర్తిస్తే ట్రిబ్యునల్ సమక్షంలో వారికి రక్షణ కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికీ వృద్ధాప్యం వస్తుందనే విషయాన్ని కుటుంబ సభ్యులు గమనించాలన్నారు. పెద్దాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ వృద్ధుల కోసం వృద్ధాశ్రమం నిర్మించేందుకు కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సీనియర్ సిటిజన్ సంఘ అధ్యక్షుడు బి.సూర్యనారాయణమూర్తి, వృద్ధులు, తల్లిదండ్రులు, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు ఏవై శ్రీనివాసు, కాకినాడ సంఘ ప్రతినిధులు ఆర్ఎస్ సుధాకర్, ఎం భాస్కరరావు, టి.శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ అత్తాకోడళ్లను, సీనియర్ సిటిజన్లను సత్కరించారు.

## ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం నేడు

**సామర్లకోట:** పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం గురువారం సాయంత్రం జరుగుతుందని ఈఓ బళ్ల నీలకంఠం బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ పాలక మండలి సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ట్రస్టు బోర్డులో కంటే జగదీష్‌మోహనరావు, చీమలకొండ వీరభద్రప్రసాదరావు, తాతపూడి అరుణ్‌వంశీ, గొల్తి సత్యనారాయణ, అలోక్ చంద్ర జైన్, కంచర్ల సుష్మమోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భానువెంకటపద్మ, బాడితమాని లక్ష్మి, గోనిపాటి బుల్లెమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యునిగా సన్నిధిరాజు వెంకటరమణను నియమించినట్లు వివరించారు. సభ్యుల ప్రమాణ స్వీకారం అనంతరం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కంటే జగదీష్‌మోహనరావును ఎన్నుకుంటారన్నారు.

# మహాశక్తీ.. పాహిమాం..

- వివిధ అలంకరణల్లో అమ్మవారి దర్శనం
- భక్తులతో ఆలయాల కిటకిట



కరప శివాలయంలో మహిషాసురమర్దినిగా పర్వతవర్ధినీదేవి

**బోట్‌క్లబ్:** శరన్నవరాత్ర ఉత్సవాల్లో మహార్నవమి సందర్భంగా బుధవారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో పూజలందుకున్నారు. అమ్మవారి ఆలయంలో నవావర్ణార్చన, కుంకుమ పూజ నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. స్థానిక భానుగుడి భాను లింగేశ్వరస్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరీదేవి అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మాధవనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో కాళికాదేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఎన్వీ సాయి బాబా ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్థానిక రిజర్వ్ లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో అమ్మవారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంమార్చనలు చేశారు. స్థానిక అశోక్‌నగర సాయిబాబా ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని మారేడు దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు పర్యవేక్షించారు.



నడకుదురులో అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

**భక్తిశ్రద్ధలతో మహార్నవమి పూజలు**

**కరప:** శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా వివిధ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో మహార్నవమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. కరప, వలసపాకల, వేములవాడ, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, వాకాడ, కూరాడ, పాతర్లగడ్డ, నడకుదురు, పెనుగుదురు, జెడ్.భావారం, అరట్లకట్ట, కొరిపల్లి, వేళంగి తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో కుంకుమార్చన చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు కొంపెల్ల చక్రధర్ పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు, నక్కా సత్యనారాయణ తదితరులు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. కరపలోని విశ్వాలయంలో ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, శివాలయంలో పర్వతవర్ధినీదేవిని మహిరాసుర మర్ధినిగా అలంకరించి ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. గొర్రిపూడి పెదరావి చెట్టు సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. కరప చింత



మాధవ్‌నగర్‌లో కాళికాదేవి అలంకరణలో..



నడకుదురులో దుర్గాదేవికి సమర్పించిన సారె

పల్లిరోడ్డులోని విజయదుర్గాదేవి ఆలయంలో అర్చకులు కొక్కిరిగడ్డ సుబ్రమణ్యం, మణికంఠ పూజలు చేశారు. విజయదుర్గా ఆటో యూనియన్, ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ చేశారు. కూరాడలోని దీపాలచెట్టు సెంటర్ దుర్గాదేవి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగుదురు సంతోషి మాత ఆలయంలో అర్చకుడు కాదా సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అరట్లకట్ట శివాలయంలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారికి అర్చకులు కొంతేటి సత్యనారాయణమూర్తి విశేష పూజలు నిర్వహించారు.

**నడకుదురులో సారె సమర్పణ**

మండలంలోని నడకుదురులో కనకదుర్గ అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి, పూజాదికాలు నిర్వహించారు. గణపతినగర్ కొత్తదిబ్బలు వీధికి చెందిన మహిళలు, యువతులు పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పిండివంటలు, పండ్లతో ఊరేగింపుగా దుర్గాదేవి ఆలయానికి వచ్చి సారె సమర్పించారు. పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాసలపు విష్ణుమూర్తి తెలిపారు. ఆదివారం ఆలయం వద్ద మహాన్నదానం ఏర్పాటు చేశారు.



కాకినాడ భానులింగేశ్వరస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో..



పెనుగుదురులోని సంతోషిమాత



కొరిపల్లిలో దుర్గాదేవి



వేళంగిలో మహిషాసురమర్దిని అలంకారంలో దుర్గాదేవి